క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గద్వాల క్రైం: ఎదురుగా వస్తున్న బైక్‌ను మరో బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురుకి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని రాజీవ్ మార్గ్ రోడ్డులో ఆదివారం ఉదయం మురళీధర్‌రెడ్డి పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. అదే మార్గంలో బైక్‌పై వస్తున్న రంజిత్, నరేష్‌లు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో మురళీధర్‌రెడ్డికి తీవ్ర గాయలయ్యాయి. ఇద్దరు యువకులకు సైతం గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి వారిని తరలించారు.

వ్యక్తి అదృశ్యం


అశోక్ (ఫైల్)

మానవపాడు: మండల కేంద్రంలో పేరపోగు అశోక్ (28) గత నెల 28న ఇంట్లో వారికి చెప్పకుండా వెళ్లిపోయి అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. చుట్టు గ్రామాలలో, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య సంతోషమ్మ ఆదివారం ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ ఎంపీని కలిసిన మంద కృష్ణ మాదిగ



అలంపూర్: హైదరాబాద్‌లో మాజీ ఎంపీ మందా జగన్నాథంను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదివారం ఆయన నివాసంలో కలిసినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు సానుకూల తీర్పు ఇవ్వడంతో మాజీ ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణలో సహాయ సహకారాలు అందించి జాతీ కోసం కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు సీనియర్ నాయకులు మంద శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

24గంటల పాటు వైద్య సేవలు అందించాలి

గద్వాల అర్బన్: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంజిపేట రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల సమయపాలన పాటించడం లేదని తెలిపారు. వెంటనే జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, 24గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

పెద్ద చింతరేవులలో సీఐ దంపతుల పూజలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో గద్వాల సీఐ సురేష్ కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి వారం కావడంతో పూజల్లో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు.

విద్యుత్ లేక అవస్థలు

ధరూరు: మండల కేంద్రంలో విద్యుత్ లేక వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. గద్వాల నుంచి వచ్చే మెయిన్ లైన్ గోనుపాడు వద్ద ఆదివారం సాయంత్రం సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో ధరూరు నుంచి పారుచర్ల స్టేజీ వరకు ఉన్న ఒకలైన్ ఖాళీగా ఉండడంతో ఆ లైన్‌ను ధరూరు సబ్ స్టేషన్‌కు లింకు చేసి ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు మరో మెయిన్ లైన్ కింద ప్రత్యేక లైన్ లాగుతున్నట్లు ఏఈ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎర్త్ ప్రాబ్లం రాకుండా ధరూరులో కరెంట్ కట్ చేసినట్లు వారు తెలిపారు. రాత్రి 10 గంటల వరకు విద్యుత్‌ను పునరుద్ధరించి ధరూరు, గోనుపాడు సబ్ స్టేషన్లు ఆన్ చేసి విద్యుత్ సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రాజోళి: మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుడిగా సేవలందిస్తూ, అనారోగ్యంతో చనిపోయిన పెద్దన్న కుటుంబానికి తెలంగాణ పారిశుద్ధ్య కమిటీ మండల గౌరవ అధ్యక్షుడు విజయ్ కుమార్ రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు తిక్కన్న, ఉపాధ్యక్షులు కృష్ణ, కమిటీ సభ్యులు రవి, దస్తగిరి, దుబ్బన్న, మహేష్, రంగన్న, సంజన్న, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


గట్టు శివారులో వాగును దాటుతున్న రైతులు


ఉధృతంగా ప్రవహిస్తున్న మానవపాడు-అమరవాయి వాగు

పొంగిపొర్లిన వాగులు

- ముసురు వర్షంతో మునిగిన పంటలు
- కూలిన పాతమిద్దెలు, గోడలు
- స్తంభించిన రాకపోకలు
- సహాయక చర్యల్లో అధికారులు, పోలీసులు

సాక్షి, నెట్‌వర్క్: అలంపూర్ మండలంలోని వాగులు, కాల్వలు వర్షాలకు పొంగిపొర్లాయి. శనివారం 49.6 మి.మీ, ఆదివారం 41.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాశీపురంలో రోడ్లపై నీళ్లు చేరడంతో రాకపోకలు నిలిచాయి. భీమవరం వాగుపొంగడంతో కొన్ని గంటల పాటు రాకపోకలు ఆగిపోయాయి. భైరంపల్లి దారిలోని వాగు నిండి రోడ్డుపై పారుతోంది.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

పట్టణంలోని పాత ఇళ్ల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సరస్వతి సిబ్బందిని ఆదేశించారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాత ఇళ్లను పరిశీలించారు. శిథిలావస్థలో ఇళ్లు ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

- ఉండవెల్లి మండలంలోని కంచుపాడులో శ్రీనివాసులు ఇంటి వెనుక భాగం కూలిపోయింది. పత్తి, మొక్కజొన్న, మిరప పంటలలో నీరు చేరడంతో రైతులు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. మెన్నిపాడు వాగు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచాయి. ఉండవెల్లి, చిన్న ఆముదాలపాడు మ ధ్య వాగు పారడంతో కంచుపాడు బ్రిడ్జి నుంచి చిన్న ఆముదాలపాడుకు రాకపోకలు కొనసాగుతున్నా యి. విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మాన్‌దొడ్డిలో వర్షాలకు నేల కూలిన పైకప్పు

- వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ వాగు పొంగిపొర్లి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 7వ వార్డులోని జమ్ములమడుగు కాలనీలో వర్షపునీరు రోడ్లపై చేరింది. 6వ వార్డులో కుర్వ నాగన్న ఇంటి గోడ కూలడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలానికి ఎస్ఐ సంతోష్ చేరుకుని పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి గుడిసెను ఖాళీ చేయించి, జెడ్పీహెచ్ఎస్‌లో వారికి ఆశ్రయం కల్పించారు. ఇందిరానగర్‌లో కొట్టం గోడ కూలింది.వడ్డేపల్లి మండలంలో 32.2 మి.మీ. వర్షం నమోదైనట్లు అధికారులు తెలిపారు.
- రాజోళి మండలంలో కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తమయ్యారు. తూర్పు గార్లపాడులో కూలే ప్రమాదమున్న మూడు ఇళ్లను గుర్తించారు. ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ఆ ఇళ్లల్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని స్థానిక రైతు వేదికకు తరలించారు. మాన్‌దొడ్డిలో చిన్న వెంకటేష్ మిద్దె కూలగా, ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ముండ్లదిన్నెలో రంగస్వామి, నరసింహులుకు చెందిన మిద్దెలు నేలకూలాయి. పెద్ద తాండ్రపాడులో సింగం పెద్ద మద్దిలేటి మిద్దె పైకప్పు కూలింది. తహసీల్దార్ హరికృష్ణ గ్రామాల్లో ఎవరూ పాత మిద్దెల్లో ఉండొద్దని, అత్యవసర సమయంలో తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.
- ధరూరు మండలంలె కురుస్తున్న వర్షాలకు పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి, ఇతర కూరగాయల పంటలు నీటిలో మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం, మన్నాపురం, జాంపల్లి గ్రామాలల్లో పదుల సంఖ్యలో సీడ్‌పత్తి పంటలు నీట మునిగాయి. ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతులకు తీవ్ర నష్టం కలిగించనున్నాయి. ఆదివారం రైతులు పంట పొలాల్లో నిలిచిన నీటిని కాలువలు ఏర్పాటు చేసి దారి మళ్లించారు.

తెగిన తాత్కాలిక రోడ్డు

నీలహళ్లి-పాతపాలెం గ్రామాల మధ్య గత నెల 22న తెగిపోయిన రోడ్డు స్థానంలో తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. గతేడాది బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పిల్లర్లు వేసి మధ్యలోనే వదిలేశాడు. రాకపోకల నిమిత్తం వేసిన తాత్కాలిక మట్టి రోడ్డు గత నెల 22న వర్షపు నీటి ధాటికి కొట్టుకుపోగా మళ్లీ వేశారు. శనివారం రాత్రి భారీ వర్షానికి కోతకు గురై రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఆరు గ్రామాలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

- కేటీదొడ్డి మండలంలో కురుస్తున్న వర్షాలకు నర్సింహులు ఇంటి పైకప్పు కూలింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. శిథిలమైన ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పంచాయతీ కార్యదర్శి రఘు ఇంటింటికి తిరిగి ప్రజలకు సూచించారు.
- మానవపాడు మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మానవపాడు-అమరవాయి వాగు, మానవపాడు-గోకులపాడు వాగు దాటలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జల్లాపురంలో మట్టిమిద్దెలు కారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.
- మల్దకల్ మండలంలో మట్టి ఇళ్లు కూలే ప్రమాదం ఉందని, ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేష్‌గౌడు సూచించారు. నేతువానిపల్లి, నేతువానిపల్లి తండాలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొలాలకు దారేది?

- గట్టు మండలంలో వ్యవసాయ పొలాలకు దారిలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గట్టు నుంచి మిట్టదొడ్డి వరకు ఉన్న బండ్ల బాట ప్రస్తుతం గట్టు చెరువు అలుగు నీరు పారి, వడ్డే ఉరుకుందు పొలం దగ్గర వాగు దాటేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. పై భాగంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో మోకాళ్లపైకి నీరు వస్తున్నట్లు రైతులు తెలిపారు. పొలాలకు దారిలేక ఇబ్బంది పడుతున్నట్లు రైతులు ఆంజనేయులు, కర్రెప్పలు వాపోయారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నీలహళ్లి - పాతపాలెం గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డు


అలంపూర్‌లో పాత ఇళ్ల వారికి సూచనలు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది


కంచుపాడులో కూలిన ఇంటి గోడ

పొంచి ఉన్న ప్రమాదం


గుర్రం తోట వీధిలో కుప్పకూలిన ఇల్లు


రంగుపేటలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇల్లు


పట్టణంలో పర్యటిస్తున్న వివిధ శాఖల అధికారులు

అయిజ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని ఇండ్లు కుప్పకూలాయి. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు మరికొన్ని ఇండ్లు నేలకూలాయి. పట్టణంలోని కొత్తపేట కాలనీలో గుడిసె గోడ కూలి గత నెల 21న చిన్నారి శ్రీకృతి మృతి చెందిన సంఘటన అందరిని కలవరపెట్టింది. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పర్యటించిన అధికారులు..

పట్టణంలో శనివారం అర్ధరాత్రి మున్సిపాలిటీలోని 11వ వార్డుకు చెందిన కుర్వ తిమ్మప్ప ఇల్లు కుప్పకూలింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆదివారం తహసీల్దార్ జ్యోతి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎస్ఐ విజయభాస్కర్, వివి ధ శాఖల సిబ్బంది మున్సిపాలిటీలోని వివిధ కాలనీలు పరిశీలించారు. పట్టణంలో మొత్తం 175 పాత ఇండ్లు ఉన్నట్లు గుర్తించారు. ఇంటి యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న 45 ఇళ్లను ఖాళీ చేయించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మూడు ఇళ్లను కూల్చేందుకు ఆదేశాలు జారీ చేశారు.

అత్యవసర సేవలకు హెల్ప్‌లైన్..

అత్యవసర సమయంలో ప్రజలను ఆదుకునేందుకు అధికారులు హెల్ప్‌లైన్ నంబర్లు ప్రకటించారు. మండలంలో సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూం నెంబర్ 9848620995, మున్సిపాలిటీలో అత్యవసర సమస్యలకు మండల పరిషత్ కంట్రోల్ రూం నెం. 9000341571, మున్సిపాలిటీలో నోడల్ అధి కారి 9052386806, హెల్త్ అసిస్టెంట్ 88868 98209, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ 9666444623, ఆఫీస్ సపోర్టింగ్ స్టాఫ్ 6281828350 నెంబర్లకు ఫోన్ యేయాలని కోరారు.

సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి



ఎడతెరిపిలేని వర్షాలకు మున్సిపాలిటీలోని వార్డుల్లో పాత ఇళ్లు కూలిపడే ప్రమాదం ఉంది. మట్టి మిద్దెల్లో నివాసముండే వారుఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలి. ఎలాంటి ప్రత్యామ్నాయం లేనివారి కోసం ప్రభుత్వ భవనాలు కేటాయించాం. వర్షాలు పూర్తిగా తగ్గిపోయే వరకు సురక్షిత ప్రదేశాల్లోనే తలదాచుకోవాలి.

– లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్

సమాచారం అందించండి



ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించండి. వరద ఉధృతి ఉన్నప్పుడు వాగులు దాటే సాహసం చేయరాదు. అత్యవసర సమయంలో వాగులు దాటాల్సి వస్తే పోలీసులకు సమాచారం అందించండి. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

– విజయ భాస్కర్, సబ్ ఇన్‌స్పెక్టర్

హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయండి



ముసురు వర్షాలకు పాత ఇండ్లు కూలిపడే అవకాశం ఉంది. అలాంటి ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు ప్రజలు తరలి వెళ్లాలి. అత్యవసర సమయంలో ఆదుకునేందుకు హెల్ప్‌లైన్ నెంబర్లను ప్రకటించాం. వర్షం వల్ల ఎలాంటి ఆపద వచ్చినా, ఎలాంటి సమయంలోనైనా హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేస్తే అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తారు.

– జ్యోతి, తహసీల్దార్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైనట్లు తెలిపారు. వారికి చెందిన రూ.3.36 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు రవిప్రకాష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రఘురెడ్డి ఉన్నారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతు



అలంపూర్ రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి అలంపూర్ మున్సిపాలిటీలోని ఇమాంపూర్ గ్రామ పరిసరాలలో 33కేవీ విద్యుత్ స్తంభం ఒక వైపు ఒరిగింది. ఆదివారం సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బంది సరిచేసి మరమ్మతు చేపట్టారు. వర్షాలకు ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తకుండా ఎమర్జెన్సీగా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ శరత్‌కుమార్ తెలిపారు. అత్యవసర పరిస్థితిలో ఆరుగురు కాంట్రాక్ట్ సిబ్బందిని, ఒక వెహికిల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.


ప్రశాంత వాతావరణంలో పండుగ జరపాలి


మానవపాడులో మాట్లాడుతున్న సీఐ టాటాబాబు

రాజోళి: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని శాంతిగనర్ సర్కిల్ సీఐ టాటాబాబు అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో అన్ని సామాజిక వర్గాల వారికి శాంతి సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల దగ్గర నిర్వాహకులు పాటించాల్సిన నియమాలు వివరించారు. ఏ విధమైన అల్లర్లకు తావివ్వకుండా పండుగ నిర్వహించుకునే విధానాలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకుని, మత సామరస్యాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమలో ఆయా పార్టీల నాయకులు, మైనార్టీలు, హిందూ సంఘాల సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులతో సీఐ టాటాబాబు సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల నిర్వాహకులు, ఆర్గనైజర్లు, గ్రామపెద్దలు శాంతియూతంగా పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రకాంత్, నాయకులు మహ్మద్ సిరాజ్ ప్రజలు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన నాయకులు



గద్వాల అర్బన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు ఎంఐఎం నాయకులు జిల్లా నుంచి పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మున్నాబాష మాట్లాడుతూ ఓట్ల రాజకీయాలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లిం సామాజిక వర్గానికి తీరని నష్టం జరుగుతుందన్నారు.

శాంతి పోరాటంలో ముందుండాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

గద్వాల అర్బన్: ప్రపంచ శాంతి కోసం చేసే పోరాటంలో కార్మికవర్గం ముందుండి అంతర్జాతీయ కార్మికవర్గ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ అన్నారు. ప్రపంచ యుద్ధాలకు వ్యతిరేకంగా, ప్రపంచ శాంతి కోసం ఆదివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్ పాలస్తీనాపై, అమెరికా అండతో ఇజ్రాయిల్ అనుసరిస్తున్న అమానుష దమన ఖండను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాలు అభివృద్ధి చెందుతున్న, సహజ వనరులున్న దేశాలపై చేస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా సామ్రాజ్యవాదాన్ని ఎదిరించాలన్నారు. కార్యక్రమంలో నరేష్, సహదేవుడు, కృష్ణ, నందకిషోర్, శివ, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు

కేటీదొడ్డి: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడి అష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వర కు ఊరేగించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, రేణప్ప, వీరన్న, తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ సత్యనారాయణ


బీచుపల్లి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

ఎర్రవల్లి: కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సత్యనారాయణ సూచించారు. ఆదివారం బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద కృష్ణానదికి వస్తున్న వరద ఉధృతిని డీఎస్పీ పరిశీలించారు. పుష్కరఘాట్ల దగ్గర ప్రజలు ఎవరూ నీటిలోకి దిగరాదన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. ప్రజలు అత్యవసరం అయితే తప్పా బయటికి రాకూడదన్నారు. వాగులు, వంకలు, గుంతలను దాటేటప్పుడు ప్రయాణికులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డీఎస్పీ వెంట ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

సామాజిక సేవలో పోలీసులు


గట్టు ఆస్పత్రి దగ్గర చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కానిస్టేబుల్ భీమేష్

గట్టు: శాంతిభద్రతలను పరిరక్షించడమేకాకుండా సామాజిక సేవలో కూడా ముందుంటామని గట్టు పోలీసులు నిరూపించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చెట్టు ఒరిగి పోయి, పక్కనే రోడ్డుపై పడింది. దీంతో మాచర్ల వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బంది ఏర్పడింది. ఎస్ఐ కేటీ మల్లేష్ దీన్ని గమనించి పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. కానిస్టేబుల్ భీమేష్‌ను అక్కడే ఉంచి, క్లియర్ చేయాల్సిందిగా ఆదేశించారు. చేత పట్టుకుని కొమ్మలు నరికి వేస్తున్న క్రమంలో నవీన్‌తో పాటుగా మరో యువకుడు కానిస్టేబుల్‌కు సహాయ పడ్డారు. నేలకు ఒరిగిన చెట్టును తొలగించి రోడ్డును క్లియర్ చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


మల్దకల్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి అన్నారు. ఆదివారం మల్దకల్‌లో బీజేపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గ్రామాల్లో ప్రజలకు వివరించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్వాయి రాముడు, మురళీధర్‌రెడ్డి, దామ నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

శాంతినగర్: సోమవారం నుంచి చేపట్టే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రికార్డుస్థాయిలో చేయించాలని బీజేపీ వడ్డేపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ కార్యకర్తలకు సూచించారు. ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి బూతులో తిరిగి సభ్యత్వాలు చేయించాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, కార్యదర్శి రంజిత్, పట్టణ ఉపాధ్యక్షులు మోహన్, రాజశేఖర్, రాఘవేంద్ర, మనోజ్, సురేష్, పరశురాముడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. అయిజను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాలని, మండలంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, ఆంజనేయులు, ప్రదీప్ కుమార్, భగత్‌రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, రఘు, మహేష్, రాజశేఖర్, నరసింహులు, మల్లేష్, నర్సప్ప పాల్గొన్నారు.


అయిజలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి